

కేంద్రమంత్రి కుమారస్వామితో చర్చిస్తున్న సతీశ్ జార్కిహొళి

సంగీత విశ్వవిద్యాలయానికి..

సహకారం కరువు..!

- ఒకటిన్నర దశాబ్దంగా సొంత భవనం లేదు
- రెగ్యులర్ సిబ్బంది లేరు
- రాష్ట్రంలోని ఏకైక సంగీత వర్సిటీ



మైసూరులోని డాక్టర్ గంగూబాయి హానగల్ సంగీత విశ్వవిద్యాలయం

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సంగీతం రాళ్లనైనా కరిగిస్తుందనేది నానుడి. ఒకప్పుడు ప్రముఖ యూనివర్సిటీలో కళలు, సంగీతం ఒక సబ్జెక్టుగా ఉండేది. ఆధునిక యుగంలోనూ యువత సంగీతం పట్ల ఆసక్తి చూపుతున్నారని ఎక్కువమంది సంగీతంలో ప్రావీణ్యం పొందేందుకు ముందుకు వస్తున్నారని రాష్ట్రంలో ఓ సంగీత విశ్వవిద్యాలయం ఉండాలని ప్రభుత్వం భావించింది. అనుకున్నదే లక్ష్యంగా దశాబ్దన్నర కిందట సంగీత విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు.

- సంగీత విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన ప్రభుత్వం సహకారం అందించడంలో పూర్తిగా విఫలమైంది. రాష్ట్రంలోని ఏకైక సంగీత విశ్వవిద్యాలయం కర్ణాటక స్టేట్ డాక్టర్ గంగూబాయ్ హానగల్ మ్యూజిక్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించారు. 15ఏళ్ల కిందట యూనివర్సిటీని ప్రారంభించినా ఇప్పటివరకు సొంత భవనం సమకూర్చలేకపోయారు. రాచనగరి మైసూరులోని లక్ష్మీపురంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఉండే చారిత్రాత్మక కట్టడంలో శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి సంగీత యూనివర్సిటీ అక్కడే కొనసాగుతోంది. తొలి వైస్‌చాన్సలర్ డాక్టర్ హనుమణ్ణ నాయక్, రెండో కులపతి డాక్టర్ సర్వమంగళ శంకర్ వ్యవహరించారు. తొలి వీసీ మైసూరు తాలూకా వరకోడు వద్ద యూనివర్సిటీకి శాశ్వత భవనాలు నిర్మింపచేసే ప్రయత్నం చేశారు. అయితే రెండో వీసీ సర్వమంగళ శంకర్ హుణసూరు తాలూకా ధర్మపుర వద్ద యూనివర్సిటీ ఏర్పాటు చేయదలిచారు. మూడో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నాగేశ్ వి బెట్టకోట, మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) సర్దార్‌వల్లభాయ్ పటేల్ నగర్‌లో క్యాంపస్‌కోసం 5 ఎకరాల స్థలం కేటాయించారు. భవన నిర్మాణాలకు 4.5కోట్ల రూపాయల గ్రాంటు అవసరమని ప్రతిపాదించారు. ఆడిటోరియం, యువతీ యువకులకు వేర్వేరుగా హాస్టళ్లు నిర్మించాలని భావించారు.

> **గ్రాంట్ల కొరత వాస్తవమే**
>
> ఇటీవల కొన్నేళ్లుగా సంగీత విశ్వవిద్యాలయానికి గ్రాంట్ల కొరత ఏర్పడింది. మూడేళ్లుగా యూనివర్సిటీ క్రియాశీలకంగా కొనసాగుతోంది. ప్రముఖ సంగీత దర్శకులు హంసలేఖ, రంగస్థల నటుడు బాబు హిరణ్ణయ్య లాంటి వారు డి లిటరేచర్ కోర్సులలో చేరి విజయవంతంగా పూర్తి చేశారు. కేవలం కర్ణాటక వాసులే కాకుండా సమీప రాష్ట్రాలతోపాటు పలు విదేశీ విద్యార్థులు ఇక్కడ కోర్సులు చేసేందుకు ముందుకొస్తుండడం సంతోషకరం.
>
> - వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ నాగేశ్ వీ బెట్టకో

- విశ్వవిద్యాలయం ఏర్పాటు అవడమేగానీ బోధన, బోధనేతర సిబ్బందిని నియమించలేదు. యూనివర్సిటీ పరిధిలో ప్రత్యేకమైన సంగీత కళాశాలలు లేవు. హుబ్బళ్ళిలోని గంగూబాయి హానగల్ గురుకుల ట్రస్టును ఇటీవలే యూనివర్సిటీ తన పరిధిలోకి తెచ్చుకుంది. యూనివర్సిటీ పలు సర్టిఫికెట్ కోర్సులు, డిప్లమో కోర్సులు, డిగ్రీ కోర్సులు కొనసాగించేందుకు 11 ప్రైవేట్ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. సర్టిఫికెట్ కోర్సులకు రూ.17,500, డిప్లమో కోర్సులకు రూ.35వేలు, డిగ్రీ కోర్సులకు రూ.65వేలుగా ఫీజు నిర్ణయించారు. సంగీత విశ్వవిద్యాలయంలో 106మంది డి లిటరేచర్ కోర్సులలో ప్రవేశం పొందారు. ఇప్పటికే 26మంది పూర్తిచేశారు. మిగిలిన 80మంది ప్రయత్నాలు చేస్తున్నారు. పీజీ కోర్సులలో 63మంది, డిగ్రీ కోర్సులలో 36మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లు కుదించడంతో ప్రతి యూనివర్సిటీకి రూ.2.50 కోట్లు ఇవ్వాల్సి ఉంది. సంగీత యూనివర్సిటీకి 1.50 కోట్ల రూపాయలు ఈ ఏడాది గ్రాంటుగా కేటాయించారు. ఇవి వేతనాలు, పర్యవేక్షణకే సరిపోయేది. రెగ్యులర్‌గా యూనివర్సిటీ చాన్సలర్ లేని కారణంగా కేటాయించిన గ్రాంట్లు ఖర్చు చేయకపోవడంతో ఆ సొమ్ము కోటికి కుదించారు. దీంతో సంగీత యూనివర్సిటీ ప్రైవేట్ సంస్థలతో ఒప్పందం చేసుకుని అడ్మిషన్ ఫీజులతోనే యూనివర్సిటీని నడుపుతున్నారు. ఏడాదికి అరకోటి గ్రాంటు తగ్గిపోవడంతో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. ఒప్పందం చేసుకున్న సంస్థలతో వనరులు సమకూర్చుకుని గెస్ట్ లెక్చరర్‌లకు ఇతర యూనివర్సిటీల తరహాలో వేతనాలు సమకూరుస్తున్నారు. అంతర్జాతీయ నృత్య కళాకారిణి డాక్టర్ వసంధర దొరస్వామి లాంటి ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. మైసూరులోని హైస్కూల్ ప్రాంగణంలోనే యూనివర్సిటీ కొనసాగుతోంది. రాష్ట్రంలో 24 కేంద్రాల ద్వారా 10వేలమంది విద్యార్థులు మరో నెలలో జరిగే పరీక్షల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

జేడీఎస్ అగ్రనేతలతో

మంత్రి సతీశ్ జార్కిహొళి భేటీ



మాజీ ప్రధాని దేవెగౌడతో మంత్రి సతీశ్ జార్కిహొళి

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే డీసీఎం డీకే శివకుమార్‌కు బద్ధశత్రువులుగా అనిపించుకుంటున్న వారు భేటీ కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇటీవల రెండేళ్లుగా జేడీఎస్ పార్టీ నేతలు దేవెగౌడ, కుమారస్వామితో డీసీఎం డీకే శివకుమార్‌కు వ్యతిరేకత ఏర్పడింది. రాజకీయంగా డీసీఎం, కేంద్ర మంత్రులు ప్రతిరోజూ తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకుంటున్నారు. ఇక కాంగ్రెస్‌లోనే డీసీఎం డీకే శివకుమార్‌కు ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి మధ్య కూడా పొంతనలేదు. పలు సందర్భాలలో అధికార, ప్రతిపక్ష సభ్యుల తరహాలో విమర్శలు చేసుకున్నారు. తాజాగా హనీట్రాప్ వివాదం తీవ్ర పరిణామాలకు కారణమవుతోంది. ఇలా సాగుతుండగానే ఢిల్లీ వెళ్లిన మంత్రి సతీశ్‌జార్కిహొళి కేంద్రమంత్రి కుమారస్వామి, జేడీఎస్ అగ్రనేత మాజీ ప్రధాని దేవెగౌడతో మంగళవారం భేటీ అయ్యారు. వేర్వేరుగా సమావేశమైనా సుదీర్ఘసమయం చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. హనీట్రాప్‌లో మంత్రి రాజణ్ణకు మద్దతుగానే సతీశ్‌జార్కిహొళి ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. అయితే జేడీఎస్ నేతలతో ప్రస్తుత పరిస్థితుల్లో సతీశ్‌జార్కిహొళి భేటీ కావడం పార్టీలో భిన్నమైన చర్చలకు కారణమవుతోంది.

గ్రేటర్ బెంగళూరు అథారిటీ బిల్లును

వెనక్కి పంపిన గవర్నర్


బెంగళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరు అథారిటీ బిల్లును గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ప్రభుత్వానికి వనక్కు పంపారు. ఒకే ప్రధాన కార్యాలయం ద్వారా పర్యవేక్షిస్తున్నందున పాలనాపరంగా పలు సమస్యలు ఏర్పడ్డాయని సమగ్ర అభివృద్ధి సాధ్యం కావడం లేదని శాసనసభ సబ్ కమిటీ రూపొందించిన గ్రేటర్ బెంగళూరు అథారిటీ బిల్లును శాసనసభ ఉభయసభలలో ఆమోదించారు. సదరు బిల్లును రాజ్‌భవన్‌కు పంపగా వెనక్కిపంపారు. ఇదే విషయాన్ని శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ బెంగళూరులో బుధవారం మీడియాకు తెలిపారు. గవర్నర్ బిల్లుపై పలు సందేహాలను ప్రస్తావించారని, వాటికి సమగ్ర వివరణలతో మరోసారి రాజ్‌భవన్‌కు పంపుతామన్నారు. కాగా బెంగళూరు పాలికెను గ్రేటర్ బెంగళూరుగా మార్చడం ద్వారా భవిష్యత్తులో పలు సమస్యలు తలెత్తుతాయని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరాదని బీజేపీ సభ్యులు గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చిన విషయం విదితమే.

పాస్ మార్కులు వచ్చేలా చూడు సామీ..!

- ఓ విద్యార్థి విచిత్ర కోరిక - హుండీలో చీటీ



బెంగళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పరీక్షాకాలం సాగుతోంది. సాధారణంగా పరీక్షలు రాసేవారిలో కొందరు విద్యార్థులు ఎక్కువ మార్కులు వచ్చేలా చూడాలని ఆన్సర్‌షీట్‌లలో రాయడం వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఓ పదో తరగతి విద్యార్థి హొలమగ్గి హూర బొబ్బరి దేవస్థానం హుండీలో వేసిన చీటీ ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. నాకు ఎక్కువమార్కులు వద్దని, జస్ట్ పాస్ అయ్యే మార్కులు చాలని రాసుకున్నాడు. గణితంలో 36-39, ఇంగ్లీష్‌లో 37-39, కన్నడలో 39-40, సైన్స్‌లో 38-39, హిందీలో 39-40, సోషియల్‌స్టడీస్‌లో 38-39 మార్కులు వస్తే చాలని రాసుకున్నాడు. దేవుడా ఇంత కంటే తక్కువ మార్కులు రాకుండా చూడుస్వామి అని రాయడం గమనార్హం. సదరు చీటీ నమ్మ కుందాపుర ఫేస్‌బుక్ పేజ్‌లో వైరల్ అయ్యింది. విద్యార్థి పేరు లేకపోవడంతో ఎవరు రాశారనేది తెలియని అంశంగా ఉంది.



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చీటీ



కృష్ణరాజసాగర్ ప్రాజెక్టు (ఫైల్)

తెరుచుకున్న కేఆర్ఎస్ గేటు

- ఆదివారం నుంచి నిరంతరాయంగా నీరు వృథా
- సాంకేతిక లోపమన్న అధికారులు
- తమిళనాడు కోసం కుట్ర జరిగింది
- మండ్య రైతుల మండిపాటు

బెంగళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కావేరి నీటికి అనుబంధమైన భారీ ప్రాజెక్టు కృష్ణరాజసాగర్ (కేఆర్ఎస్)లో 80వ క్రెస్ట్‌గేట్ తెరుచుకుంది. ఆదివారం రాత్రి గేట్ తెర్చుకోవడంతో క్యూసెక్కుల నీరు వృథా అయింది. సోమవారం రాత్రి దాకా నీరు వృథాగా వెళ్లింది. కావేరి బోర్డు అధికారుల నిర్లక్ష్యమే భారీగా నీరు వృథా అయ్యేందుకు కారణమని మండ్య జిల్లా రైతులు మండిపడ్డారు. మోటార్‌స్విచ్‌కు బదులు గేట్ స్విచ్‌ను ఉపయోగించడంతోనే క్రస్ట్ గేటు తెరుచుకుని ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే సాంకేతిక లోపంతోనే గేట్ తెరుచుకుందని సూపరింటెండెంట్ ఇంజనీర్ రఘురాం తెలిపారు. గేట్ ఎవరు తెరిచారో, ఎందుకు అలా జరిగిందనే అంశంపై నివేదిక కోరామన్నారు. ప్రస్తుతం పూర్తిగా గేట్ మూసివేశామన్నారు. సుమారు 2వేల క్యూసెక్కుల నీరు విడుదలైందన్నారు. నీరు విడుదల కావడంపై మండ్య జిల్లా రైతులు అధికారులను తప్పుబట్టారు. రాత్రికి రాత్రి తమిళనాడుకు గుట్టుచప్పుడు కాకుండా నీరు వదిలారని మండిపడ్డారు. తమిళనాడు పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక అభిమానమని విరుచుకుపడ్డారు.

రాష్ట్ర బీజేపీ 'ఎక్స్' ద్వారా అధికారుల నిర్లక్ష్యంపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. సమయానికి అనుగుణంగా చర్యలు తీసుకోని అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌యత్నాళ్ 'ఎక్స్' వేదికగా కేఆర్ఎస్ క్రెస్ట్‌గేట్ ఓపెన్ కావడంపై అనుమానాలు నివృత్తి కావాలంటే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామి మీడియాతో మాట్లాడుతూ తమిళనాడుకు నీరు వదలాలని గేట్‌లు తెరవలేదన్నారు. ఓ గేట్ పొరపాటున తెరుచుకోవడంతో అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకున్నారన్నారు. కేఆర్ఎస్ క్రెస్ట్‌గేట్‌లు పరిశీలించాలని జలవనరులశాఖ మంత్రి డీకే శివకుమార్ కోరామన్నారు. దశాబ్దాలక్రిందటి గేట్‌లు కావడంతో సమస్య ఉందన్నారు. ప్రాజెక్టులో 80 అడుగుల నీరు చేరేసరికి పరిశీలన జరుగుతాయన్నారు. కానీ 107 అడుగుల నీరు ఉన్నందున ప్రస్తుతం పరిశీలించడం సాధ్యం కాదన్నారు. వెయ్యి క్యూసెక్కులలోపు నీరు వృథా అయి ఉండవచ్చునన్నారు.

64 గంటల్లో లక్ష చదరపు అడుగుల నిర్మాణం

- ప్రశంసించిన మంత్రి ఎంబీ పాటిల్



ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మౌంట్ రూఫింగ్ స్ట్రక్చర్స్ సంస్థ నిర్మాణరంగంలో వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను నమోదు చేసింది. తుమకూరు జిల్లా శిరాలోని పారిశ్రామికవాడలో 64 గంటల వ్యవధిలో 1.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రి-ఇంజనీర్డ్ భవనాన్ని నిర్మించారు. భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ సంస్థను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో భారీ పరిశ్రమలకు మౌలిక వనరులు సమకూర్చడంలో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వేగవంతంగా నిర్మాణాలు చేపట్టడం ద్వారా పరిశ్రమలకు అనుకూలం కానుందన్నారు. మౌంట్‌రూఫింగ్ సంస్థ ఎండీ షేర్‌సింగ్ మాట్లాడుతూ మా బృందం అనుకున్న లక్ష్యానికి సకాలంలో పూర్తి చేసిందన్నారు. నిర్మాణరంగంలో ఇదో మైలురాయి అని కొనియాడారు. భరత్‌బొమ్మై మాట్లాడుతూ సాంకేతిక ప్రగతికి మౌంట్‌రూఫింగ్ నిర్మాణం నిదర్శనమన్నారు.

ఆర్థరైటిస్ మహిళకు పీఈఎస్‌లో

అరుదైన ఆపరేషన్



కోలుకున్న మహిళతో వైద్యులు

బెంగళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌కు చెందిన 48ఏళ్ల మహిళ రెండేళ్లకుపైగా ఆర్థరైటిస్‌తో ఇబ్బంది పడుతుండేది. పలు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన మహిళ పీఈఎస్ మెడికల్ కళాశాలలో చేరగా ఆర్థో వైద్యుల బృందం వ్యాధి తీవ్రతను గుర్తించింది. మోకాలికి శస్త్రచికిత్స జరిపారు. ఆర్థో విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మౌలిగ్ బి షా, డాక్టర్ అవినాశ్ సీకేల నేతృత్వంలో రెండు విడతల శస్త్ర చికిత్సలు జరిపారు. డాక్టర్ మౌలిగ్ మాట్లాడుతూ బాధిత మహిళ ఆసుపత్రికి చేరేసరికే తీవ్రమైన పరిస్థితిలో ఉండేవారన్నారు. ఆమెకు అత్యవసర ఆపరేషన్ అవసరమని నిర్ధారించి శస్త్రచికిత్స చేశామన్నారు. ప్రస్తుతం మహిళ సంపూర్ణంగా కోలుకున్నారన్నారు. పీఈఎస్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి, డైరెక్టర్‌లు సురేశ్ కృష్ణమూర్తి, రూపా సురేశ్, ప్రిన్సిపాల్ డాక్టర్ పీ హరిప్రసాద్ వైద్య బృందాన్ని అభినందించారు.

'అప్ప'కు వ్యతిరేకం...

- సహచరుల్లో వణుకు
- బీజేపీలో ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు

యత్నాళ్‌పై ఆరేళ్ల వేటు..!

బెంగళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీకి కీలకనేతగా దశాబ్దాల పోరాటంతో కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేంతగా అభివృద్ధి చేసిన అగ్రనేత యడియూరప్ప (అప్ప)ను ఏళ్ల తరబడి టార్గెట్ చేస్తూ వచ్చిన విజయపుర సీనియర్ ఎమ్మెల్యే, కేంద్రమాజీ మంత్రి బసనగౌడపాటిల్‌యత్నాళ్‌పై పార్టీ క్రమశిక్షణా కమిటీ కొరడా ఝుళిపించింది. యత్నాళ్‌పై ఆరేళ్లపాటు సస్పెన్షన్ వేటు వేసింది. ఆయన ఎమ్మెల్యే పదవికి గండం వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీ పరమైన ఏ పదవుల్లోనూ కొనసాగరాదని తక్షణం నుంచి ఉత్తర్వులు అమలయ్యేలా ఆదేశాలు జారీ అయ్యాయి. రెండేళ్లుగా బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రకు ఇతర పార్టీల నేతలకంటే యత్నాళ్ నుంచే నిత్యం విమర్శలు ఎదుర్కొనే పరిస్థితి కొనసాగింది. అవినీతికి పాల్పడ్డారని, పార్టీని భ్రష్టు పట్టించారని తండ్రీకొడుకుల పెత్తనంతో పార్టీ పతనం అవుతోందనే వ్యాఖ్యలే కాకుండా యడియూరప్ప కులం ఉద్దేశించి కూడా తరచూ విమర్శలు గుప్పించారు. రాష్ట్ర బీజేపీలో నాలుగు దశాబ్దాలుగా యడియూరప్ప తిరుగులేని నేతగా కొనసాగారు. నలుగురైదుగురితో కలిసి పార్టీని అభివృద్ధి చేసేందుకు నడుం బిగించి ఏకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేంతటిస్థాయికి తీసుకొచ్చారు. దక్షిణాదిన బీజేపీ ప్రభుత్వం ఏర్పడేందుకు ఆయన చొరవే కారణం. ఇటీవల రెండున్నర దశాబ్దాలకుపైగా నాయకులు పెరిగారు. ప్రభుత్వం ఏర్పాటుతో మంత్రులు అటు కేంద్రంలోనూ కీలక హోదాలలో కొనసాగడం ద్వారా రాష్ట్రంలో పార్టీ శక్తివంతమైంది. వీటన్నింటికీ మార్గదర్శి యడియూరప్ప అనేది పార్టీలోని అన్నివర్గాలు నేటికీ స్మరిస్తాయి. యడియూరప్ప పట్ల అధిష్ఠానం సైతం సానుకూలంగానే ఉంది. అయితే పార్టీలో గ్రూపులు ఇటీవల తారస్థాయికి చేరుతూ వచ్చాయి. ఒకప్పుడు గ్రూపులు ఉన్నా రహస్యంగానే ఆరోపణలు చేసేవారు. కానీ ఇటీవల రాష్ట్ర పార్టీతో సంబంధం లేకుండానే జిల్లాలవారీగా వివిధ అంశాలపై పోరాటాలు కొనసాగిస్తూ వచ్చారు. ఈ పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధిష్ఠానం పలు విధాల కసరత్తు జరిపింది.



బసవనగౌడ పాటిల్ యత్నాళ్

రాష్ట్ర పార్టీ నేతలను పలు సందర్భాలలో హెచ్చరించింది.

యత్నాళ్ సహచరులకు వణుకు

రాష్ట్రంలోని బీజేపీ ముఖ్యనాయకులపై వ్యతిరేకించే కూటమి సారథిగా యత్నాళ్ తొలి అడుగులు వేసినా ఆ తర్వాత పలువురు ఆయన వెంట కదిలారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు విజయేంద్రను ఎప్పటికీ నాయకుడిగా భావించలేమని, ఆయన సారథ్యంలో పనిచేయలేమని బహిరంగంగా సవాల్ విసిరేలాంటి కూటమి ఏర్పడింది. ఐదేళ్లకిందట బీజేపీలో చేరిన కీలకనేత రమేశ్‌జార్కిహొళి, దావణగెరె జిల్లా హరిహర ఎమ్మెల్యే బీపీ హరీశ్, కేంద్ర మాజీ మంత్రి సిద్దేశ్వర్, రాష్ట్ర మాజీ మంత్రి అరవింద లింబావళితోపాటు పలువురు ఉన్నారు. వీరంతా రాష్ట్ర పార్టీతో సంబంధం లేకుండానే వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిపై పోరాటం అంటూ ఉత్తర కర్ణాటకలో జిల్లాల వారీగా పర్యటించారు. విజయపురలో నిరసన కొనసాగించారు. ప్రభుత్వం కంటే సొంత పార్టీ నేతలను టార్గెట్ చేస్తూ విమర్శలు చేసేవారు. పలుమార్లు ఈ బృందం ఢిల్లీ వెళ్లి అగ్రనేతలను కలిశారు. ఢిల్లీలో కేంద్రమంత్రి సోమణ్ణను కలవడమే కాక విజయపురలో వీరి నిరసనకు కేంద్రమంత్రి శోభాకరంద్లాజె హాజరయ్యారు. ఫిబ్రవరి 10న యత్నాళ్‌కు అధిష్ఠానం క్రమశిక్షణా కమిటీ నోటీసులు జారీ చేసింది. గడువులోగానే ఢిల్లీ వెళ్లి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. పార్టీ నేతలకు వ్యతిరేకంగా మాట్లాడరాదని మరోసారి అదే పరిణామం కొనసాగితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కొన్ని రోజులు మౌనంగా ఉన్నా ఆ తర్వాత యథావిధిగా యడియూరప్ప, విజయేంద్రలను టార్గెట్ చేస్తూ విమర్శించారు. దీంతో క్రమశిక్షణ కమిటీ ఇటీవలే ఓ రహస్య నివేదికను తెప్పించుకున్నట్టు తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే చర్యలకు సిద్ధమైంది. పార్టీలో విభేదాలు తారస్థాయికి చేరితే త్వరలో జరిగే గ్రామపంచాయతీ, నగరపాలక ఎన్నికలతోపాటు 2028 శాసనసభ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని అధిష్ఠానం కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమైంది. మంగళవారం ముగ్గురు ఎమ్మెల్యేలతోపాటు ఇద్దరు మాజీ మంత్రులకు షోకాజ్ నోటీసులను జారీచేసిన క్రమశిక్షణా కమిటీ ఒక్కసారిగా రెబెల్ గ్రూప్‌కు సారథిగా ఉన్న యత్నాళ్‌పై ఆరేళ్ల సస్పెన్షన్ వేటు వేశారు. ఇక ఆయన రాజకీయ భవిష్యత్తు ఎటువంటి మార్పులు జరుగతాయనేది వేచి చూడాలి. ఆరేళ్లపాటు వేటు అంటే వచ్చే ఎన్నికల్లో ఆయన బీజేపీ నుంచి పోటీ చేసే అవకాశం కోల్పోతారు. పార్టీ పదవుల్లోనూ కొనసాగకుండా ఆంక్షలు ఉన్నాయి. యత్నాళ్‌పై వేటుపడ్డంతో ఆయన వెంట నడుస్తున్నవారికి ఒక్కసారిగా వణుకు పట్టుకుంది.

కనుమరుగవుతున్న ఫైర్‌బ్రాండ్ నేతలు

హిందూత్వ అజెండా, బీజేపీ అగ్రనేతల్లో ప్రత్యేకించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపట్ల అంతులేని అభిమానం చూపుతూ ఫైర్‌బ్రాండ్‌లుగా పేరు తెచ్చుకున్న పలువురు కనుమరుగు అవుతున్నారు. ఈ ప్రభావం పార్టీపై పడుతోందని చర్చలు కొనసాగుతున్నాయి. సుదీర్ఘకాలంగా హిందూత్వ ఫైర్‌బ్రాండ్ అనేలా రాణించిన కేంద్రమాజీ మంత్రి అనంతకుమార్ హెగ్డే ఇటీవల రాజకీయాలకు దూరమయ్యారు. ప్రతి అంశంలోనూ నిక్కచ్చిగా మాట్లాడే మహిళానేతగా పేరొందిన శోభాకరంద్లాజె కేంద్రమంత్రి అయ్యాక రాష్ట్ర రాజకీయాలకు సంబంధించిన అంశాలపై నోరు మెదపడం లేదు. ఇక సీటీ రవి క్రియాశీలకంగానే ఉన్నా బెళగావి శాసనసభ శీతాకాల సమావేశాల చివరిరోజు దాడి జరిగిన విషయం తెలిసిందే. పార్టీకి అంకితభావంగానే ఉన్నా సొంత పార్టీ నేతలపైనా విరుచుకుపడే మనస్తత్వం కల్గిన యత్నాళ్‌పై ఆరేళ్లవేటు పడింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.48 (గురువారం సాయంత్రం)

సెహరీ : 5.06 (శుక్రవారం ఉదయం)

కవ్వింపులు... క్యాంపులు

- ఉప ఎన్నికల్లోనూ వైసీపీ కుట్రలు
- నేడు ఖాళీపడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి
- అధికారుల నియామకం
- ఉమ్మడి జిల్లాలో 5 ఎంపీపీ, నాలుగు చొప్పున వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ ఖాళీలు
- రామగిరిలో ఘర్షణ
- టీడీపీ వర్గీయుల వాహనాలు ధ్వంసం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అరెస్టు
- కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



జడ్పీ కార్యాలయం

పుట్టపర్తి/అనంతపురం విద్య, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీపడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ స్థానాలకు నిర్వహిస్తున్న ఎన్నికల్లో వైసీపీ నాయకులు కవ్వింపులకు పాల్పడుతున్నారు. ఆయా పదవులను దక్కించుకోడానికి ఘర్షణలు, దాడులకు దిగుతున్నారు. దీంతో రెండు పార్టీల నేతల మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి. రామగిరిలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య వాగ్వాదం, ఘర్షణ ఆఖరికి దాడుల వరకూ వెళ్లింది. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని సోమందేపల్లిలో అరెస్టు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9 మండలాల్లో ఎంపీపీ, వైఎస్ ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో హైటెన్షన్ నెలకొంది. అలాగే నాలుగు ఉప సర్పంచ్ స్థానాలకూ ఎన్నిక నిర్వహించనున్నారు.

టీడీపీ వెంట వస్తారనే...

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక చాలాచోట్ల వైసీపీ నుంచి నాయకులు కూటమి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు సైతం అడుగేస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు వైసీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కవ్వింపు చర్యలతోపాటు, దాడులకు దిగుతున్నారు. రామగిరిలో ఇదే జరిగింది. బుధవారం రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు రెచ్చగొట్టడంతో ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో పరస్పర దాడులు కారణంగా ఇరువర్గాల వాహనాలు ధ్వంసమయ్యాయి. సోమందేపల్లిలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఎన్నికలు సజావుగా సాగకుండా చేయాలనే కుట్రలో భాగంగా వైసీపీ మూకలు ఇలా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. రెండు జిల్లాల అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలు కూడా అమర్చారు.

9 స్థానాలకు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 9 స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవల పలు కారణాల వల్ల ఖాళీ పడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు నేడు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 5 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటికి ఉప ఎన్నికల నిర్వహణకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, జడ్పీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే 9 మండలాలకు ఎన్నికల అధికారులను నియమించారు. గురువారం ఉదయం 10 నుంచి ఒంటి గంట మధ్య ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు. తొమ్మిది మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు బందోబస్తు నడుమ ఎన్నికలు నిర్వహించనున్నారు.

రామగిరిలో..

రామగిరి మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలుండగా.. 9 వైసీపీ, ఒకటి టీడీపీ నెగ్గింది. వైసీపీ నుంచి ఎంపీపీగా ఎన్నికైన నాగమ్మ అనారోగ్య కారణాలతో మృతిచెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. వైపీపీ నుంచి ఎన్నికైన సభ్యుల్లో ముగ్గురు టీడీపీ వైపు మొగ్గుచూపినట్లు సమాచారంతో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. గురువారం నేరుగా ఎంపీటీసీలను మండల పరిషత్ కార్యాలయానికి తీసుకొచ్చేలా వైసీపీ నాయకులు ఎత్తుగడ వేశారు. ఈనేపథ్యంలో బుధవారం విప్ జారీ చేయాలంటూ మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన వైసీపీ నాయకులు.. టీడీపీ వర్గీయుల వాహనాలను ధ్వంసం చేశారు. ఈ పరిస్థితుల్లో ఎంపీపీ ఎంపికపై ఉత్కంఠ నెలకొంది.

గాండ్లపెంటలో..

మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఎంపీపీ జగన్మోహన్ రాజీనామాతో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఐదుగురు వైసీపీ, ఇద్దరు టీడీపీ మద్దతుదారులు ఉన్నారు. వైసీపీ మద్దతుదారుల్లో ఇద్దరు టీడీపీకి అనుకూలంగా ఓటేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎంపీపీ టీడీపీ మద్దతు అభ్యర్థి అయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. వైసీపీ మద్దతుతో గెలిచి, సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ఎంపీటీసీ సభ్యుడిని ఎంపీపీగా ఎన్నుకునే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన నలుగురిని క్యాంపునకు తరలించారు.

వైసీపీలోనే వార్

రొద్దం ఎంపీపీ ఎన్నిక విషయంలో వైసీపీలోనే వార్ నడుస్తోంది. స్థానాన్ని కైవశం చేసుకునేందుకు వైసీపీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. రొద్దం మండలంలో ఉశశ్రీ వర్గం ఒకవైపు, శంకర్‌నారాయణ వర్గం ఒకవైపు తమ వర్గానికి ఎంపీపీ స్థానం దక్కాలంటూ ఎవరికి వారు పావులు కదుపుతున్నారు. పెనుకొండ మండలంలోని రాంపురం పంచాయతీలోని వార్డు సభ్యురాలు నవతాబాయి కొంతకాలం క్రితం రాజీనామా చేశారు. ఏడాది క్రితం రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతిచెందారు. రొద్దం మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ఎంపీపీ మృతితో 14 మంది ఉన్నారు. వారిలో ఉషశ్రీ వర్గీయులు నలుగురు, శంకర్ నారాయణ వర్గానికి చెందిన ఏడెనిమిది మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఎంపీపీ స్థానం ఎస్సీకి రిజర్వ్ కావడంతో కలిపి ఎంపీటీసీ వనజ, చిన్నమంతూరుకు చెందిన నాగమ్మ ఎంపీపీ బరిలో ఉన్నారు. నాగమ్మ పేరు ప్రస్తావనలో ఉన్నట్లు తెలుస్తోంది. నాగమ్మ, వనజలో ఎవరు ఎంపికవుతారని ఉత్కంఠ నెలకొంది.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించే స్థానాలు..

జిల్లా	ఎంపీపీ స్థానాలు	వైస్ ఎంపీపీ స్థానాలు
అనంతపురం	కణేకల్లు కంబదూరు	ఉరవకొండ-2 యల్లనూరు పెద్దపప్పూరు రాయదుర్గం
శ్రీసత్యసాయి	గాండ్లపెంట రొద్దం రామగిరి	

నాలుగు ఉప సర్పంచ్ స్థానాలకూ..

ఉమ్మడి జిల్లాలో నాలుగు గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్ స్థానాలకు గురువారం ఎన్నిక నిర్వహించనున్నారు. అనంతపురం జిల్లాలో పామిడి మండలం రామగిరి, వజ్రకరూరు మండలం కొనకొండ్ల ఉప సర్పంచ్ స్థానానికి ఎన్నిక నిర్వహించనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో పెనుకొండ మండలం రాంపురం, మడకశిర మండలం కల్లుమర్రి ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

కంబదూరులో..

ఎంపీపీగా రెండున్నరేళ్ల పాటు కొనసాగిన తలారి తిమ్మరాజమ్మ రాజీనామా ఇవ్వడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మండలంలో 15 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. వారిలో ఒకరు మృతి చెందారు. దీంతో 14 మంది ఎంపీటీసీ సభ్యులతో ఎంపీపీని ఎన్నుకుంటారు. వీరంతా వైసీపీ మద్దతులోనే గెలిచారు. తమ సభ్యులు ఎక్కడ జారిపోతారోనన్న భయంతో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. 10 మంది ఎంపీటీసీ సభ్యులను నాలుగు రోజుల క్రితమే విహారయాత్రకు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈనెల 25న ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ఒక్క సభ్యుడు కూడా హాజరుకాలేదు. మొత్తం సభ్యుల్లో నలుగురు టీడీపీతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఆ నలుగురే కీలకంగా మారి, మిగతా ఎంపీటీసీ సభ్యులను టీడీపీ వైపు తీసుకొచ్చే అవకాశాలు లేకపోలేదు. దీంతో ఆ నలుగురి కదలికలపై వైసీపీ నాయకులు నిఘా వేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ కండువా వేసుకుని, ఆ పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మండలంలోని రాళ్లఅనంతపురం గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు కురుబ లక్ష్మీదేవమ్మను ఎంపీపీగా ఎన్నుకునే అవకాశాలున్నాయి.

ముందస్తు ఎన్నిక

కణేకల్లు ఎంపీపీగా పనిచేసిన సంధ్య రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. మండలంలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలున్నాయి. వీటిలో 17 స్థానాలను వైసీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఒకచోట టీడీపీ మద్దతు అభ్యర్థి గెలిచారు. ఈ నేపథ్యంలో ఎంపీపీగా వైసీపీ మద్దతు అభ్యర్థి ఎన్నికవడం ఖాయంగా కనిపిస్తోంది. ఎంపీపీ ఎస్సీ జనరల్ రిజర్వేషన్ కేటాయించారు. ఒకరు రాజీనామా చేయగా.. ఇంకా ఇద్దరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సభ్యులున్నారు. వారిలో ఎవరిని ఎంపీపీ చేయాలన్న విషయమై వైసీపీ నేతల ఆధ్వర్యంలో మండలంలోని ఓ గ్రామంలో ఎన్నిక నిర్వహించుకున్నట్లు తెలిసింది. గరుడచేడు ఎంపీటీసీ సభ్యుడు వంద్రయ్యకు 12 మంది, మరో ఎంపీటీసీకి ఇద్దరు మాత్రమే మద్దతు తెలిపారు. దీంతో వంద్రయ్య ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9 మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలకు ఏర్పాట్లు చేశాం. ఎన్నికల, ప్రిసైడింగ్ అధికారులను నియమించాం. ఎన్నికలున్న అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు వీడియోగ్రఫీ కూడా తీయిస్తున్నాం. ఎన్నికలు సజావుగా సాగేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం.

-రామచంద్రారెడ్డి, జడ్పీ సీఈఓ, అనంతపురం

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ రత్న



జిల్లాలో ఎంపీపీ, ఉపసర్పంచ్ ఎన్నికల సందర్భంగా గొడవలు, అల్లర్లు సృష్టించాలని చూస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న హెచ్చరించారు. గురువారం జిల్లాలో మూడు ఎంపీపీ, రెండు ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నిక సమయంలో 30 పోలీసు యాక్టు, 144 సెక్షన్ అమలులో ఉంటాయన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెడతామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

దర్యాప్తు స్టేటస్ రిపోర్టు మా ముందుంచండి: హైకోర్టు

అమరావతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉండగా న్యాయవాది బీవీ శేషాద్రి మృతిచెందిన వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తు స్టేటస్ రిపోర్ట్‌ను తమ ముందు ఉంచాలని పోలీసులకు స్పష్టం చేసింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర డీజీపీ, అనంతపురం జిల్లా ఎస్పీ, అనంతపురం మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు నోటీసులు జారీచేసింది. పోలీసులు సమర్పించే నివేదిక సంతృప్తికరంగా లేకుంటే సీబీఐ విచారణకు ఆదేశిస్తామని స్పష్టం చేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అనంతపురం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది బీవీ శేషాద్రి గతేడాది డిసెంబరులో మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉండగా మరణించారు. ఈ ఘటనపై హైకోర్టు పర్యవేక్షణలో మేజిస్ట్రేట్‌తో విచారణ జరిపించి, నిర్దేశిత గడువులోగా నివేదిక సమర్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ అధీకృత ప్రతినిధి జి.రంగనాయకులు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది అరుణ్‌శౌరి వాదనలు వినిపించారు. న్యాయవాది మృతిపై అనుమానాలున్నాయని సోదరి ఫిర్యాదు చేసిందని చెప్పారు. ఘటన జరిగిన రోజు పోలీస్‌స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వాలని కోరగా, పోలీసులు నిరాకరిస్తున్నారన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఘటనపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

పారదర్శకతకు పాతర..!

- డ్వామా బదిలీల్లో విచిత్రాలు
- ఆ 8 మంది ఏపీఓలు తిరిగి తెరపైకి..
- వైసీపీ హయాంలో నిబంధనలకు తూట్లు
- అదే బాటలో హెచ్‌ఆర్ విభాగం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్‌ఓ, డ్వామా పీడీ (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): డ్వామాలో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా చేస్తున్నామంటూనే కొందరు అధికారులు కౌన్సెలింగ్‌ను అనుకూలంగా మార్చుకున్నారు. తమకు అనుకూలంగా ఉన్న ఉద్యోగులను ఎంచుకున్న స్థానంలోకి చేర్చడానికి డ్వామాలో హెచ్‌ఆర్‌తో పాటు కొందరు అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. పేరుకే కౌన్సెలింగ్ జరిగిందని, తెరవెనుక వేరే వ్యవహారాలు నడిచాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై ఉన్నతాధికారులకు ఎందుకంత ప్రేమో అన్న చర్చ జరుగుతోంది. ఏళ్లుగా పాతుకుపోయినా అదే స్థానంలో కొనసాగించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లు ఇలా ఉద్యోగుల బదిలీల్లో చిత్రవిచిత్రాలు కనబడుతున్నాయి. టీఏలలో చివరిలో ఉండే వ్యక్తికి జిల్లా కేంద్రంలోని స్థానాన్ని ఎలా కేటాయిస్తారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక సరిహద్దులోని ఓ మండలంలో పనిచేస్తున్న ఉద్యోగి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండే మండలానికి రావాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తోటిఉద్యోగులే చెబుతున్నారు. ఇందుకు హెచ్‌ఆర్‌తో పాటు పలువురు అధికారులు సహకస్తున్నారని తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లు సుమారు 25 మందికి పైగా పీడీ కార్యాలయానికి అక్రమమార్గంలోనే డెప్యుటేషన్ పేరుతో వచ్చారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వారిని కదిలించకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాజా బదిలీల్లో విచిత్రాలు

డ్వామాలో ఇటీవల చేసిన బదిలీల్లో అన్నీ విచిత్రాలే కనిపిస్తున్నాయి. హెచ్‌ఆర్ విభాగంలో ఉన్న ఉద్యోగులే బదిలీలను శాసించారు. డ్వామా కీలక అధికారిని కీలుబొమ్మగా మార్చేసి కొందరు అధికారులు వారి కనుసన్నల్లోనే కౌన్సెలింగ్ చేపట్టినట్లు తెలుస్తోంది. టెక్నికల్ అసిస్టెంట్లలో చివరిలో ఉండే వారికి సైతం జిల్లా కేంద్రానికి అతిసమీపంలో స్థానం కల్పించారు. మొదటి వరుసలో ఉన్నవారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీలకు ముందురోజే వ్యూహాత్మకంగా తమ ప్రణాళికను అమలు చేశారని ఉద్యోగులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అనంతపురం రూరల్, కూడేరులో ఈసీ పోస్ట్ ఖాళీగా ఉన్నప్పటికీ జాబితాలో చూపలేదు. హెచ్‌ఆర్‌లో ఒకరు ఆరేళ్లు, మరొకరు ఎనిమిదేళ్లుగా ఒకే స్థానంలో ఉంటూ డ్వామాను శాసిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తెరపైకి ఆ 8 మంది బదిలీలు..

గత సంవత్సరం ఆగస్టులో అప్పటి పీడీ ఎనిమిది మంది ఏపీఓలను బదిలీ చేశారు. ఎందుకు, ఎవరి సిఫారసుతో బదిలీ చేశారో అర్థం కాని పరిస్థితి. ఆ ఎనిమిది మంది ఏపీఓలకు స్థానచలనం కల్పించాలని డ్వామా అధికారులు యత్నిస్తున్నట్లు సమాచారం. అప్పట్లో బదిలీ అయిన వారిలో పుట్లూరు నుంచి బొమ్మనహాల్‌కు భాగ్యలక్ష్మి, ఆత్మకూరు ఏపీఓ పుష్పావతి కళ్యాణదుర్గానికి బదిలీ చేయగా విధుల్లో చేరారు. మిగిలిన వారిలో.. పీడీ కార్యాలయంలో డెప్యుటేషన్‌పై ఉన్న ఆదినారాయణమ్మను తాడిపత్రికి, రాప్తాడు ఏపీఓ ఓబన్నను డి.హీరేహాల్‌కు, కూడేరు ఏపీఓ సుజాతను కంబదూరుకు, గార్లదిన్నె ఏపీఓ మురళీకృష్ణను బెళుగుప్పకు, తాడిపత్రి ఏపీఓ రాజ్యలక్ష్మిని బ్రహ్మసముద్రానికి, పామిడి ఏపీఓ విజయభారతిని రాయదుర్గానికి బదిలీ చేశారు. ఆ ఎనిమిది ఏపీఓలు బదిలీపై వెళ్లేందుకు ఇప్పటికే స్థానాలు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఆయా స్థానాల్లో వేరే ఏపీఓలు ఉన్నా సరే.. వాళ్లను వేరు మండలాలకు పంపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. నార్పలలో ఇద్దరు ఏపీఓలు ఉండగా.. ఒకరిని పంపాలని చూస్తున్నారు. బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నె, శింగనమల, యల్లనూరు మండలాలకు వారిలో ఐదుగురు ఏపీఓలను రప్పించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో బదిలీల నిబంధనలను తుంగలోతొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇప్పుడు కూడా అదేబాటలో పయనించడంపై కొందరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ప్రకారమే చేస్తున్నాం



డ్వామాలో అన్నీ నిబంధనల ప్రకారమే చేస్తున్నాం. ఇన్‌చార్జిలు, డెప్యుటేషన్లు, బదిలీలు ఇలా ప్రతిదీ సీఆర్‌డీ, జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి పొందాకే అమలు చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా చేయడానికి అవకాశమే లేదు. సీఆర్‌డీ గైడ్‌లైన్స్ ప్రకారమే ఉపాధి ఉద్యోగులను కౌన్సెలింగ్ ద్వారా స్థానచలనం కల్పించాం. గతంలో జరిగిన పరిణామాలకు ప్రస్తుతం పారదర్శకంగా చేపట్టే బదిలీలకు సంబంధం లేదు.

- సలీంబాషా, పీడీ, డ్వామా

నేడు సతామి

- రంజాన్ మాసంలో పవిత్రమైన రోజుగా ముస్లింల విశ్వాసం
- ఖురాన్ గ్రంథం దివి నుంచి భువికి వచ్చిన రోజు
- ఉపవాసం, జాగరణ చేయనున్న ముస్లింలు



పుట్టపర్తి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో 27వ రోజు సతామీ (లైలతుల్ ఖద్ర్)గా చేసుకుంటారు. ప్రస్తుత రంజాన్ మాసంలో గురువారం సతామీ నిర్వహించుకుంటారు. ఈ రోజున పవిత్ర గ్రంథం ఖురాన్ దివి నుంచి భువికి వచ్చినట్లు ముస్లింలు భావిస్తారు. ఆరోజు రాత్రి జాగరణ, ప్రార్థనలు చేస్తూ గడుపుతారు. ఈ ఒక్కరాత్రి భక్తితో ప్రార్థనలు చేసేవారికి 83 ఏళ్ల ప్రార్థనలు చేసిన ప్రతిఫలం దక్కుతుందని ముస్లింల నమ్మకం. ఈ రాత్రిచేసే ప్రార్థనల వల్ల సర్వపాపాలు తొలగిపోతాయని భావిస్తారు. రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాసం, జకాత్, ఫిత్రా, తర్హావీలను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ నేపథ్యంలో గురువారం సతామీకి ఏర్పాట్లు చేసుకున్నారు.

ఉపవాస దీక్ష ఎందుకంటే..

రంజాన్ నెలలో సన్మార్గంలో నడుస్తూ పరిశుద్ధమైన జీవనం సాగించాలన్నదే ఇస్లాం మత ముఖ్య ఉద్దేశం. అలాంటి మాసంలో సూర్యోదయం ముందు నుంచీ సూర్యాస్తమయం వరకు ఆధ్యాత్మిక చింతనతో ఘన, ద్రవ, పదార్థాలు తీసుకోకుండా ఉంటారు. తద్వారా ఆకలి బాధ తెలుస్తుంది. ఆకలితో అలమటించే పేదవాడి బాధను తెలుసుకుని, వారికి సాయం చేయాలన్న దృక్పథం ఏర్పడుతుందని ముస్లింల నమ్మకం. అలాంటి విశ్వాసంతో భగవంతుడిపై నమ్మకం ఉంచి, నమాజ్ చేయాల్సి ఉందనీ, అది ఆధ్యాత్మిక జీవనం సాగించేందుకు దోహదపడుతుందని కఠోర ఉపవాసం చేస్తారు.

జకాత్..

ఇస్లాం ఐదు మూలస్తంభాల్లో నాలుగోది జకాత్. దీని అర్థం తన ఆదాయంలో కొంత భాగాన్ని అవసరమనుకున్న పేదవారికి పంచిగానీ, సాయంచేసిగానీ సంపదను ధార్మికం చేసుకోవడం. ప్రతి ముస్లిం తన సాంవత్సరిక ఆదాయం, ధనంలో 2.5 శాతం అల్లాహ్ మార్గంలో అవసరమున్న వారికి, పేదవారికి దానం చేయాలి. ఈ ధార్మిక విధానాన్ని జకాత్ అంటారు. ఇది మోక్షమార్గదారుల్లో ఒకటిగా చెప్పుకుంటారు.

ఫిత్రా..

ఈ పదానికి అర్థం మానవునిలో గల ప్రాకృతిక ధర్మం తనతోపాటు ఇతరులకు సంతోషాన్ని ఇవ్వడం. ఆ ప్రాకృతిక ధర్మం ప్రతి మనిషిలో ఉంటుందనీ, దీని ప్రకారం మానవుడిని దైవమార్గాన, భాగ్యం కల్పించడం, ప్రముఖంగా ఈ ఫిత్రాను రంజాన్ పండుగ రోజు ప్రత్యేక ప్రార్థనల ముందే పేదలు, అభాగ్యులకు ఇచ్చేదానం, ప్రతి ముస్లిం కనీసం ఇవ్వవలిసిన దానం. ఇది పండుగకు ముందురోజునే ఇవ్వాలి. ఎందుకంటే పేదవారు కూడా పండుగ ఆనందంగా చేసుకోవడానికి అది ఉపయోగపడాలి. ఇది కుటుంబంలోని ప్రతి సభ్యుడు తప్పక ఇవ్వాల్సిన ధర్మం. దేవుడి పట్ల కృతజ్ఞతగా ఇవ్వాలి.

తర్హావీ ఖురాన్ పఠనం

రంజాన్ మాసం ప్రారంభమైన మొదటి రోజు నుంచీ ప్రతిఒక్కరూ రాత్రి ప్రత్యేక ప్రార్థనలతోపాటు దివ్య ఖురాన్ పఠనం చేయాలి. అంతేగాక ఎతిఖాఫ్ పాటించాలి. అంటే లైలతుల్ ఖద్ర్ నాటి నుంచి పూర్తిగా కుటుంబానికి దూరంగా మసీదులోనే ఉంటూ ఆధ్యాత్మిక చింతనలోనే పండుగ రోజు వరకు గడపాలి. తద్వారా అంతులేని పుణ్యఫలాలు లభిస్తాయనీ, తను నివసిస్తున్న గ్రామం, పట్టణం సుభిక్షంగా ఉంటుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం.

ఇంటి నుంచే ఉపాధి

- సర్వే చేపట్టిన ప్రభుత్వం
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- సేకరిస్తున్న సచివాలయ ఉద్యోగులు



సర్వేలో భాగంగా వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగి

ధర్మవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపాధి అవకాశాల పెంపు పట్ల రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇంటి వద్ద నుంచే ఆదాయం పొందేలా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీంతో క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులు 15 రోజులుగా జిల్లాలో ఇంటింటికి వర్క్‌ఫ్రం హోమ్ సర్వే చేపడుతున్నారు. ప్రత్యేక యాప్ ద్వారా సచివాలయ సిబ్బంది వారి పరిధిలో గల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వారిని ఈ సర్వేలోకి తీసుకుంటున్నారు. ఇంట్లో కుటుంబసభ్యులు ఎంతమంది ఉన్నారు. వారిలో చదువుతున్న వారు ఎంతమంది, విద్యార్థులు, ఏమిటి అనే వివరాలు సేకరి స్తున్నారు. ఇంజనీరింగ్ చదివితే ఉద్యోగం చేస్తున్నారా? ఏ రంగానికి చెందిన వారు సాఫ్ట్‌వేర్‌కు అయితే ఇంటి వద్ద నుంచి పని చేసుకునే ఆసక్తి ఉందా లేదా అనే అంశాలు పరిగణలోకి తీసుకుంటున్నారు. చేతి వృత్తుల్లో అయితే వడ్రింగి, కరెంటు, తాపీమేస్త్రీ, కుట్టుమిషన్, రజకులు, దర్జీ పనులు, కంప్యూటర్లు, టీవీలు, సెల్‌ఫోన్ రిపేరీ చేసేవారు, బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుని ఖాళీగా ఉన్నవారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఏదేమైనా ప్రస్తుత సర్వే ప్రకారం కొత్తగా వివాహమై అత్తారింటికి లేదా భర్త పని చేసే ప్రాంతానికి వచ్చి ఖాళీగా ఉన్నవారికి వర్క్ ఫ్రం హోమ్ ఎంతో ఉపయోగపడుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు రద్దవుతాయేమోనని, పింఛన్లు ఆగిపోతాయేమోనని చాలా మంది ఈ సర్వేలో వివరాలు చెప్పడానికి వెనుకడుగు వేస్తున్న ట్లు సమాచారం. ఏ ఒక్కరికీ ఈ సర్వే వల్ల నష్టం ఉండదని, ప్రజల వ ద్దకు వచ్చే సర్వే సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

పది రోజుల్లో పూర్తి

జిల్లా వ్యాప్తంగా వర్క్‌ఫ్రం హోమ్ ఇంటింటి సర్వే జరుగుతోంది. ఇప్ప టికి 70శాతం పూర్తయింది. మరో పది రోజుల్లో మొత్తం పూర్తవుతుంది. ఈ సర్వే పూర్తయితే ప్రతి ఇంటి సమగ్ర సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తాం. వీటి ద్వారా ప్రభుత్వ పథకాలను కూడా అర్హులైన వారికి అందజేసేందుకు వీలుంటుంది. ప్రతి ఒక్కరు ఈ సర్వేకు సహకరించాలి.

- సుధాకర్‌రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ ఆఫీసర్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

స్వామి విపులానంద (జయంతి)



విపులానంద అడిగల్‌గా పేరొందిన స్వామి విపులానంద 1892 మార్చి 27న శ్రీలంకలో జన్మించారు. తమిళ హిందూ సంఘ సంస్కర్త. సాహితీవేత్త, కవి, ఉపాధ్యాయుడిగా రాణించారు. రామక్రిష్ణ మిషన్‌తో కలసి ముందుకు సాగారు. తమిళంతోపాటు ఆంగ్లం, గ్రీకు, లాటిన్, సంస్కృతం, సింహళ భాషలలో నిపుణులు. షేక్స్పియర్ రచించిన 12 నాటకాలను అనువదించారు. శ్రీలంకలో ఆయన పేరిట ఎన్నో ఇన్‌స్టిట్యూషన్స్ ఉన్నాయి. భక్తి, సంగీత పుస్తకాలు రచించారు. 1947 జూలై 19న కన్నుమూశారు. ఆయన గౌరవార్థం శ్రీలంక, జర్మనీలలో పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

అన్నవరపు రామస్వామి (పుట్టినరోజు)



వయోలిన్ విద్వాంసులు 'పద్మశ్రీ' గ్రహీత అన్నవరపు రామస్వామి 1926 మార్చి 27న పశ్చిమ గోదావరి జిల్లా సోమవరప్పాడు ప్రాంతంలో జన్మించారు. ప్రత్యేకించి కర్ణాటక సంగీతంలో రాణించారు. 1948 నుంచి 1986 వరకు ఆకాశవాణిలో సేవలందించారు. పక్కవాద్య కళాకారుడిగానే కాక స్వతంత్రంగా కూడా కచేరీలు నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, కళారత్న అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు.

రామ్‌చరణ్ తేజ (పుట్టినరోజు)



మెగా పవర్‌స్టార్‌గా గుర్తింపు పొందిన 'మెగాస్టార్' చిరంజీవి కుమారుడు కొణిదెల రామ్‌చరణ్ తేజ 1985 మార్చి 27న జన్మించారు. తెలుగు సినీరంగంలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. సొంతంగా ప్రొడక్షన్ కంపెనీని ఏర్పాటు చేశారు. 2013లో ఫోర్బ్స్ టాప్ 100 ఇండియన్ సెలబ్రిటీస్‌లో చోటు దక్కించు కున్నారు. చిరుత, మగధీర, రంగస్థలం సినిమాలు ఎంతో గుర్తింపుతెచ్చాయి. రెండు నంది అవార్డులు, మూడు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. అభిమానులు 'చెర్రీ' అని పిలుస్తారు.

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయండి

● లోక్‌సభలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ బుధవారం లోక్‌సభలో కోరారు. రైల్వే ఆస్పత్రుల్లో సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పారామెడికల్ సిబ్బంది నియామకం ఇదివరకు పబ్లిక్ అడ్వర్టైజ్‌మెంట్, నియామక కమిటీ ద్వారా జరిగేదన్నారు. ఇటీవల ప్రభుత్వ ఈ మార్కెట్‌ప్లేస్ (జీఈఎం) ద్వారా మాత్రమే చేపట్టాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ విధానం వల్ల ఆస్పత్రి యాజమాన్యానికి అభ్యర్థుల అర్హతలు, నైపుణ్యాలు, అనుభవం పరిశీలించే అవకాశాన్ని తగ్గిస్తోందన్నారు. తరచూ సిబ్బంది మారడం ద్వారా ఆస్పత్రి కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. దీని ప్రభావం రోగులకు అందించే వైద్య సేవలపై పడుతోందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని గత నియామకపు విధానాన్ని పునరు ద్ధరించి, ఆస్పత్రి కమిటీ ఆధ్వర్యంలోనే మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఏపీలో నాలుగు ప్రధాన రైల్వే డివిజన్లు విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు ఉన్నప్ప టికీ సొంత రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు లేదన్నారు. దీని కారణంగా ఉద్యోగ ఖాళీలు భర్తీకావడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఏపీకి ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి, రైల్వే ఉద్యోగాల భర్తీపై కేంద్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని కోరారు.

గంజాయి విక్రేతకు పదేళ్ల జైలు

గుంతకల్లు, మార్చి26(ఆంధ్రజ్యోతి): గంజాయిని ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తరలిస్తూ గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పట్టుబడిన వ్యక్తికి అనంతపురం ఏడీజే సత్యవాణి 10 సంవత్సరాల జైలు, రూ. లక్ష జరిమానా విధించారు. ఒడిశా రాష్ట్రం కోడెల గ్రామా నికి చెందిన భగవాన్ పోలై 2023 డిసెంబరు 18న గంజాయిని తరలిస్తూ గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పట్టుబడ్డాడని జీఆర్పీ పోలీ సులు తెలిపారు. ఒడిశా నుంచి 32 కేజీల గంజాయిని గుజరాత్‌కు తరలించడానికి వచ్చిన నిందితుడు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో రైలు మారడానికి దిగాడన్నారు. రైలు కోసం వెయిటింగ్ హాల్‌లో వేచి ఉండగా, సాధారణ తనిఖీల్లో భాగంగా బ్యాగులోని సమాన్లను తీసి చూడగా అందులో గంజాయి కనిపించిందన్నారు. రైల్వే స్టేషన్‌లో ఉన్న ఏఈ ఓబులేశు నుంచి ఫిర్యాదు తీసుకున్న అప్పటి జీఆర్పీ సీఐ నగేశ్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తును పూర్తిచేసి అనంతపురం ఏడీజే కోర్టుకు చార్జ్‌షీట్‌ను దాఖలుచేశారు. కేసులో నలుగురు సాక్షులను విచారించిన ఏడీజే సత్యవాణి ఆరోపణ రుజువు కావడంతో బుధవారం తీర్పును వెలువరించారని జీఆర్పీ పోలీసులు తెలిపారు. కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఈశ్వరమ్మ వాదించారని పేర్కొన్నారు.

కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లోనే..

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సొసైటీల్లో కార్యకలాపాలు, లావాదేవీలు ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించా లని, మ్యాన్‌వల్ గా చేస్తే ఒప్పుకునేది లేదని ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఏడీసీసీ బ్యాంకు 128వ మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి సొసైటీలలో కార్యకలాపాలు, లావాదేవీలు అన్ని కంప్యూటర్ ద్వారా మాత్రమే జరగాలని, ఇందుకు సంబంధించి సొసైటీల సీఈఓలు, పర్సన్ ఇన్‌చార్జిలు, సూపర్‌వైజర్లు, సంబంధిత సహకార శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. డిపాజిట్లు సేకరించాలని, వాయిదా మీరిన రుణాలపై త్వరితగతిన లీగల్ కవరేజ్ పూర్తి చేసి మొండి బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఇక నుంచి ఆన్‌లైన్ రసీదులు మాత్రమే చెల్లుబాటవుతాయన్నారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబం ధించి రూ.167.5కోట్ల బడ్జెట్‌ను మహాజనసభ ఆమోదించింది. కార్యక్రమంలో రెండు జిల్లాల డీసీఓలు అరుణ కుమారి, కృష్ణానాయక్, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, నాబార్డు డీడీఎం అనురాధా, అధికారులు పాల్గొన్నారు.

వరల్డ్ 10కేలో భాగస్వాములు కండి

▸ హాకీ క్రీడాకారిణి మన్‌ప్రీత్‌సింగ్ పిలుపు



పోటీల టీ షర్టు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు, ప్రముఖులు

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగే వరల్డ్ 10కేలో భాగస్వామ్యులు కావాలని ప్రముఖ హాకీ క్రీడాకారిణి ఏ6 అథ్లెట్ మన్‌ప్రీత్‌సింగ్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 27న జరిగే వరల్డ్10కేకు సంబంధించి టీ షర్టు, లోగోలను బుధవారం ఆవిష్కరించారు. 17వ విడత పోటీలకు 25వేలమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు టీసీఎస్ రీజనల్ హెడ్ సునిల్ దేశ్‌పాండే అభిప్రాయపడ్డారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నారాయణన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. వరల్డ్10కే పురుషులు, మహిళల విభాగాలతోపాటు మజారన్ ఉంటాయన్నారు. మీడియా సమావేశంలో శాంతినగర్ ఎమ్మెల్యే, బీడీఏ చైర్మన్ హారిస్, ప్రోకామ్ ఇంటర్నేషనల్ ఎండీ వివేక్‌సింగ్, కర్ణాటక అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రాజవేలు, ఏఎస్ఐసీఎస్ మార్కెటింగ్ డైరెక్టర్ సౌరభ్‌శర్మ, సునిల్ దేశ్‌పాండే, సమర్థనం ట్రస్టు అధ్యక్షుడు మహంతేశ్, సీనియర్ ఐఏఎస్ అధికారి రణదీప్, రాజేంద్ర కఠారియాతోపాటు పలువురు పాల్గొన్నారు.

శ్మశాన ఆక్రమణలు తొలగించండి



వివిధ సంఘాల సభ్యులు

బంగారపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శ్మశానానికి వెళ్లే స్థలాన్ని ఆక్రమించారని వెంటనే ఆక్రమణలు తొలగించాలని కొమ్మేనహళ్ళి గ్రామస్థులు డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం తాలూకా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటక రిపబ్లిక్ సేన (కేఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చిక్కనారాయణ మాట్లాడుతూ తాలూకాలోని గాజగ సర్వే నెంబరు 61/1లో 1.14 ఎకరాల స్థలాన్ని కి చెందిన నారాయణస్వామి ఆక్రమించి ఇటుకల బట్టీ నిర్వహిస్తున్నారన్నారు. సర్వేయర్, కొంతమంది అధికారులు అతడికి కుమ్మక్కు ఇచ్చారని ఆరోపించారు. గ్రామ ప్రజలమధ్య చిచ్చు పెట్టే కుట్ర సాగుతోందన్నారు. వెంటనే అతడికి సహకారం అందిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఇటుకల బట్టీ తొలగించి శ్మశానానికి వెళ్లేందుకు మార్గం కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసనలో కేఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అంబరీశ్, ప్రజా విమోచన చళువళి జిల్లాధ్యక్షుడు మణి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు గుట్టహళ్ళి శ్రీనివాస్, తిప్పణ్ణ, కృష్ణమూర్తి, అంబేడ్కర్ జనసేన సంస్థాపకుడు మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇక్కట్లు



బేగూరు రోడ్డులో ట్రాఫిక్ ఇలా...

బొమ్మనహళ్ళి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బొమ్మనహళ్ళి - బేగూరు రోడ్డులో ఇటీవల కొన్నిరోజులుగా ట్రాఫిక్ జామ్‌తో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు చిన్నదిగా ఉండడం, వాహనాల రద్దీ పెరగడంతోనే ట్రాఫిక్‌జామ్‌కు కారణమని తెలుస్తోంది. కొంతమంది అడ్డదిడ్డంగా వాహనాలు నడపడంకూడా మరో సమస్యకు కార ణంగా ఉంది. సుమారు ఐదారు కిలోమీటర్ల దూరం ప్రయాణానికి గంటకు పైగా సమయం పడుతోందని పలువురు వాహన చోదకులు వాపోతున్నారు. ఒకవేళ అత్యవసరంగా వెళ్లాలంటే ప్రత్యా మ్నాయం లేకపోవడంతో గత్యంతరం లేక వెళ్తున్నట్టు స్థానికులు అంటున్నారు. రోడ్డు విస్తరణ చేపట్టాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉన్నప్పటికీ స్పందన లేదని తెలుస్తోంది. దీనిపై ప్రజాప్రతినిధులు స్పందిం చాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఈ-ఖాతా పత్రాలు పంపిణీ



ఈ-ఖాతా పంపిణీలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

బాగేపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ-ఖాతా అభియానలో భాగంగా వివిధవర్గాల ప్రజలు సమర్పించిన అర్జీదారులకు ఈ-ఖాతా ఆదేశాలను ఎమ్మెల్యే సుబ్బారెడ్డి అందచేశారు. పురసభ ఆవరణలో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పట్టణ పరిధిలోని స్థలాలు, వసతి భవనం, వాణిజ్య భవనాలు, ఇంటి ఆస్తులు, ఖాళీ స్థలాలకు సంబంధించిన అర్జీలకు ఇ-ఖాతాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాతాకోసం దళారులను ఆశ్రయించరాదన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు ఏ శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు సుజాత నరసింహనాయుడు, పురసభ సభ్యులు ఏ నంజుండప్ప, గడ్డం రమేశ్, జబీవుల్లా, సరోజ, రేష్మా బాబు, సునితా తదితరులు పాల్గొన్నారు.

పథకాల కోసం దళారులను ఆశ్రయించవద్దు



సామూహిక సీమంతంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

చేళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చాకవేలులో బుధవారం గ్రామసభ సందర్భంగా గర్భిణీలకు సామూహిక సీమంతం నిర్వహించారు. గర్భిణీలు తమ ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తొలుత ప్రజల సమస్యలు ఆలకించారు. పింఛన్లు, పక్కా ఇళ్లు, గృహలక్ష్మి పథకం, తదితర వాటిపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి అర్హులైన వారు ఎవరూ దళారులను ఆశ్రయించవద్దన్నారు. ప్రజల అర్జీలను పరిశీలించి దశలవారీగా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ప్రతి బుధవారం తమ కార్యాలయం వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ట్రై సైకిళ్లు, కిట్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

దొమ్మసంద్ర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సురగజక్కనహళ్ళి గ్రామ పంచాయతీలో అలింకో సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లకు కిట్లు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. పరిశ్రమలశాఖ సహకారంతో 250 మందికిపైగా లబ్ధిదారులకు టైలరింగ్ మిషన్‌లు పంపిణీ చేశారు. ఆనేకల్ తాలూకా ఈఓ మంజునాథ్, జిల్లా దివ్యాంగుల స్వావలంబనశాఖకు చెందిన కృష్ణమూర్తి కిట్లను అందచేశారు. బ్యాటరీతో నడిచే సైకిళ్లు, వీల్‌చైర్, వాకింగ్‌స్టిక్, వీల్‌చైర్ విత్ కమోడ్, స్మార్ట్‌కేన్, హియరింగ్ హెడ్ తదితర ఉపకరణాలు అందచేశారు. కార్యక్రమంలో తాలూకా ఎంఆర్‌డబ్ల్యు, ఆనేకల్ తాలూకా వీఆర్‌డబ్ల్యు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేయండి



ఎమ్మెల్యే మంజుళా లింబావళిని సత్కరిస్తున్న స్థానిక మహిళలు

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కొనసాగుతున్న నిర్మాణ పనులు వర్షాకాలం రాకముందే పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌లకు ఎమ్మెల్యే మంజుళా లింబావళి సూచించారు. నిర్మాణాలు నాణ్యతగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కొడతి, కాచమారనహళ్ళిలో రోడ్డు అభివృద్ధి, గరుడాచార్‌పాళ్యశెట్టి లే అవుట్‌లో యూజీడీ పైప్‌లైన్ పనులు, కాడుగూడి పటాలమ్మ లే అవుట్‌లో, గోడౌన్ రోడ్డులో కావేరి తాగునీటి పనులను బుధవారం ఆమె పరిశీలించారు. కొడిగేహళ్ళిరోడ్డులోని ఆల్ఫా లే అవుట్‌లో కావేరి నీటి సరఫరాను ప్రారంభించారు. చుట్టుపక్కల ప్రాంతాల పైప్‌లైన్ అమరిక పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానికులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ హోబళి పట్టణ అధ్యక్షుడు ఎన్ఆర్ శ్రీధర్‌రెడ్డి, భూ న్యాయమండలి మాజీ సభ్యుడు కేఎన్ బాబురెడ్డి, కొడతి వార్డు బీజేపీ అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, గ్రామ పంచాయతీ సభ్యులు నవీన్, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వాదనతో కృష్ణాజలాల్లో నష్టం

● రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి



మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న వాదనతో కృష్ణా జలాల్లో నష్టం జరిగే ప్రమాదముందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి జలాలను కోస్తా ప్రాంతానికి తరలించి అక్కడ ఆదా అయిన నీటిని శ్రీశైలంలో నిల్వ చేసి, వాటిని రాయలసీమకు మళ్లించడమే సరైన మార్గమని అన్నారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జలసాధన సమితి ఆధ్వర్యంలో 'రాయలసీమ నీటి ప్రాజెక్టులు-వెనుకబాటుతనం' అనే అంశంపై బుధవారం సమావేశం నిర్వహించారు.

జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బొజ్జ దశరథరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గోదావరి జలాలను బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించి రాయలసీమకు నీళ్లిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. ఇందులో రెండు సమస్యలు ఇమిడి ఉన్నాయన్నారు. మొదటిది ఎక్కువ ఖర్చుతో కూడుకున్న అంశమన్నారు. బొల్లాపల్లి నుంచి బనకచర్లకు తరలించేందుకు సుమారు రూ.38 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారన్నారు. అయితే ఈ మొత్తాన్ని రాయల సీమలోని పెండింగ్ ప్రాజెక్టులు, కాలువ పనులు పూర్తి చేయడానికి ఉపయోగిస్తే 15 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వచ్చన్నారు. రెండో అంశం గోదావరి బనకచర్ల ప్రాజెక్టుల వల్ల ట్రిబ్యునల్లో అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న వాదన వల్ల కృష్ణా జలాల్లో నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. 1988 సంవత్సరంలో హంద్రీనీవా ప్రాజెక్టుకు నిర్దేశించిన విధంగా ఆరు లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడంలో డిజైన్ లోపం వల్ల ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ చేయడం వల్ల శాశ్వతంగా నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. లైనింగ్ పనులను వెంటనే రద్దు చేయాల న్నారు. హంద్రీనీవా మెయిన్ కాలువ 10 వేల క్యూసెక్కులకు వెడల్పు చేసి పిల్ల కాలువ వ్యవస్థ ద్వారా ఆరు లక్షల ఎకరాలకొత్త ఆయకట్టుకు నీరివ్వాలని కోరారు.

సమావేశంలో జల సాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి కృష్ణ, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, సహకార్యదర్శి ప్రకాష్, ఇఫ్ టు అధ్యక్షులు ఏసురత్నం, విద్యావంతుల వేదిక వెంకటేష్, నాయకులు రాహుల్, లక్ష్మి, వీరేంద్ర, వేమయ్య, పెద్దన్న, వీరు నారప్ప, అరుణోదయ చంద్ర, ఉమ్మడి కర్నూలు జిల్లా రాయలసీమ సాగునీటి సాధనసమితి నాయకులు వైఎస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, శేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందనాప్యాలెస్‌కు ఉత్తమ ఆంధ్ర రుచుల అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఆర్ రవిచందర్

బెంగళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రుచులతో అన్ని వర్గాలను ఆకట్టుకుంటూ నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్న నందనా ప్యాలెస్‌కు ఉత్తమ అవార్డు దక్కింది. బెంగళూరు హోటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుడ్ అవార్డ్స్ 2025ను ప్రదానం చేశారు. నందనా ప్యాలెస్ సీఎండీ డాక్టర్ ఆర్ రవిచందర్‌కు ఉత్తమ అవార్డును ప్రదానం చేశారు. ప్రముఖ నటుడు విజయరాఘవేంద్ర, ఎఫ్‌కేసీసీఐ చైర్మన్ బాలకృష్ణ, ప్రొఫెసర్ రాధాకృష్ణ, హోటల్ అసోసియేషన్ సెక్రటరీ వీరేంద్రకామత్, సుధాకర్‌శెట్టితోపాటు పలువురు పాల్గొన్నారు.

మైసూరులో ఉగాది వేడుకలు

బెంగళూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో మైసూరులో ఉగాది వేడుకలు జరగనున్నాయి. రామకృష్ణ నగర్‌లోని పీడీరెడ్డి తెలుగు భవనంలో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 30న ఆదివారం ఉగాదిరోజున సాయంత్రం 6 గంటలనుంచి వేడుకలు ప్రారంభం అవుతాయన్నారు. పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ, ఉగాదిపాటలతోపాటు గత ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం, సినిమా క్విజ్, మ్యూజికల్ నైట్ నిర్వహిస్తామన్నారు.

వైట్‌ఫీల్డ్‌లో..

ఉగాది పండుగను పురస్కరించుకుని బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని గ్లోబల్ స్కూల్ ఆడిటోరియంలో మా తెలుగుతల్లి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు జరుపుతున్నట్టు డాక్టర్ వై కస్తూరి తెలిపారు. చలసాని విద్యా సంస్థల చైర్మన్ చలసాని పూర్ణచంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొం టున్నారు. ఇస్కాన్ సంస్థ ఉపాధ్యక్షులు శ్యామ్‌వల్లభదాస, యునైటెడ్ టెలికామ్స్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ పీ రాజామోహనరావు పాల్గొంటారు. సభాధ్యక్షులు కొమరరాజు ఉమామహేశ్వరావు, కార్యదర్శి ఇందిరా బెల్దేల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగనున్నాయి. ఆదివారం సాయంత్రం 4.25 గంటలకు ప్రార్థన, వేదబ్రహ్మశ్రీ ఎన్ రవిశంకరశాస్త్రి ద్వారా పంచాంగ శ్రవణం, ఉగాది పండుగ విశిష్టతను శ్యామ్ వల్లభదాస్ వివరించ నున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నట్టు తెలిపారు.

పులకేశినగర్‌లో రంజాన్ కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న మంత్రి జమీర్ తదితరులు

బెంగళూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంజాన్‌ను పురస్కరించుకుని పులకేశినగర్‌లో మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే ఏసీ శ్రీనివాస్ నేతృత్వంలో బుధవారం రంజాన్‌కిట్లు పంపిణీ చేశారు. స్థానిక ముస్లింలు వందలాదిమంది పాల్గొని కిట్లు అందుకున్నారు. పండుగను సంబరంగా చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఘనంగా కామణ్ణ దినోత్సవం




వివిధ వేషాలతో విద్యార్థులు, కళాబృందం

శిడ్లఘట్ట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దేవరమళ్ళూరు గ్రామంలో గ్రామస్థులు, కళాకారుల ఆధ్వర్యంలో కామణ్ణ దినోత్సవం అర్థవంతంగా నిర్వహించారు. కళాకారులు వివిధ వేషాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. గ్రామపెద్ద బచ్చప్ప మాట్లాడుతూ పూర్వీకులు అందించిన సంప్రదాయాలకు అనుగుణంగా కామణ్ణ దినోత్సంలో కరగ కుణిత, కరడి కుణిత తదితర వేషాలతో చిన్నారులు సందడి చేశారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

డీఎస్సీ శిక్షణకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రేపటిలోగా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం షార్ట్‌లిస్ట్ చేసిన ఫేజ్-2 ఎస్సీఎస్టీ అభ్యర్థుల జాబితా https://mdfc.apcfss.in వెబ్‌పోర్టల్‌లో ఉంచామ న్నారు. షార్ట్‌లిస్ట్‌లో పేరు ఉన్న అభ్యర్థులు వారి ప్రాధాన్యం మేరకు శుక్రవారంలోపు అన్ని కోచింగ్ సంస్థలకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1596.11	1,581.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,200	744
నీటి నిల్వ (టీఎంసీలు)	16.90	5.48

ఎమ్మెల్యే నగర పర్యటన



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నారా భరత్‌రెడ్డి

బళ్లారి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నగరంలోని పలు వార్డులను సిటీ ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. 6వ వార్డుతో పాటు పలు వార్డులలో పర్యటించిన నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ 'గుడ్‌మార్నింగ్ బళ్లారి' అంటూ ప్రతినిత్యం వార్డుల్లో పర్యటిస్తానని, సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. ఇక నుంచి రెవెన్యూ, కరెంటు, పోలీస్‌స్టేషన్ల, ప్రజలు సమస్యలకు ప్రతినిత్యం వార్డును సందర్శించి పరిష్కరిస్తానని తెలిపారు. గుడ్ మార్నింగ్ బళ్లారి అని ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను వింటానని తెలిపారు. కార్పొరేటర్లు బీఆర్ఎల్ శ్రీనా, యువరాజు, కాంగ్రెస్ ప్రముఖులు చానల్ శేఖర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర చాలా ముఖ్యం

● డాక్టర్ నిష్టి రుద్రప్ప



మాట్లాడుతున్న కన్నడ సాహిత్య పరిష్యత్ అధ్యక్షుడు నిష్టి రుద్రప్ప

బళ్లారి సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): దేశానికి సేవ చేయడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర ముఖ్యమని కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నిష్టి రుద్రప్ప అన్నారు. బుధవారం కొళగల్ గ్రామంలో వీరశైవ మహావిద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో స్వచ్ఛంద సేవకుల సమగ్ర అభివృద్ధికి జాతీయ సేవా పథకం బాధ్యత వహిస్తుందన్నారు. ఈపోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదగడానికి సహాయపడుతుందన్నారు. శాస్త్రీయ దృక్పథకాలను పెంపొందించుకోవాలని, చెడు అలవాట్లను వదిలించుకోవాలని, పుస్తక బాండాగారంగా మారాలని సూచించారు. కళాశాల పాలకమండలి అధ్యక్షుడు దరూర్ శాంతనగౌడ, సభ్యులు అక్కి శికారాజ్, కరడిహూడి ముద్దనగౌడ, కన్వీనర్ వినోద్ కుమార్, కవితా సంగనగౌడ, శరణబసవ శిబిర అధికారులు పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్ర జట్టుకు గణేశ్ ఎంపిక



రాయచూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలో 27 నుంచి జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లిన కర్ణాటక జట్టుకు రాయచూరు తాలూకాకు చెందిన యువకుడు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. రాయచూరు తాలూకాలోని రాళదొడ్డికి చెందిన గణేశ్ ప్రాథమిక విద్యాభ్యాసం నుంచే కబడ్డీలో రాణిస్తూ జిల్లాలో కబడ్డీ క్రీడాకారుడు సురేశ్ వద్ద కోచింగ్ పొందుతూ తన ప్రతిభను చాటాడు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొన్న గణేశ్ బీహార్‌కు వెళ్లే రాష్ట్ర జట్టులో సభ్యుడిగా ఎంపికయ్యాడు. రాష్ట్ర జట్టుకు గణేశ్‌ను నాయకుడిగా నియమిస్తూ ఇటీవలే రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహిస్తున్న గణేశ్ మరింత ప్రతిభతో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి కీర్తి తేవాలని తాలూకాకు చెందిన అమేచూర్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సభ్యులు బుధవారం ఆకాంక్షించారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

జడ్పీ సీఈఓ మహమ్మద్ హారీస్ సుమైర్



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న జడ్పీ సీఈఓ

బళ్లారి సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నీరు ప్రకృతి ప్రసాదించిన వరమని,అది చాలా విలువైనదని, మనమందరం పొదుపు చేద్దాం అని జిల్లా పంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ సుమైర్ అన్నారు. పంచాయతీ, జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ, గ్రామీణ తాగునీరు, పారిశుధ్య విభాగం, వీరశైవ మహావిద్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో వీరశైవ మహావిద్యాలయ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగం మనకు ప్రాథమిక హక్కులను మాత్రమే కాకుండా ప్రాథమిక విధులను కూడా ఇచ్చిందన్నారు. ఇందులో పర్యావరణ పరిరక్షణతోపాటు నీటి సంరక్షణ కూడా ఉందన్నారు. నీటిని సంరక్షించి స్థిరమైన అభివృద్ధి ద్వారా భవిష్యత్ తరాలకు అందిద్దాం అని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎండలు పెరుగుతున్నాయని, తాగునీటిని వృథా చేయకుండా చూసుకోవాలన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి కాలువలకు ఏప్రిల్ 10వరకు నీరు వదులుతారన్నారు. వ్యవసాయ కార్యకలాపాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. జిల్లా లీగల్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె మాట్లాడుతూ అన్ని జీవులకు నీరు చాలా ముఖ్యమైనదన్నారు. భూమిపై ఉన్న నీటిలో 97శాతం ఉప్పునీరు, వినియోగానికి ఉపయోగపడే మంచినీరు కేవలం 3 శాతం మాత్రమే అన్నారు. ఈనీటిలో 0,07శాతం మాత్రమే తాగడానికి ఉపయోగపడుతుందన్నారు. మిగిలిన నీరు హిమనీనదాలలో ఘన రూపంలో ఉందని ఆయన అన్నారు. వేసవి సమీపిస్తున్న కొద్ది తాగునీటి కొరత ఏర్పడి చుక్కనీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అందువల్ల నీటిని వృథా చేయకుండా అవసరమైనంత మాత్రమే వాడాలని సూచించారు. ప్రపంచ జల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, రంగోలి పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జడ్పీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వాగీశ్ శివాచార్య, గ్రామీణ తాగునీరు, పారిశుధ్య విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇందుధర, రామచంద్ర, రవీంద్రనాయక్, వీరశైవ మహావిద్యాలయ అధ్యక్షుడు దరూర్ శాంతనగౌడ, సభ్యుడు కరడి ముద్దనగౌడ, కళాశాల ప్రిన్సిపాల్ మల్లనగౌడతో పాటు కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు

హంపికి రాయబారులు టూర్ గైడ్లు : ఎమ్మెల్యే గవియప్ప



మాట్లాడుతున్న హొసపేట ఎమ్మెల్యే గవియప్ప

బళ్లారి సిటీ,మార్చి 26(ఆంధ్రజ్యోతి): హంపి ప్రతిష్టతను ప్రపంచ స్థాయికి పెంచడంలో స్థానిక పర్యాటక గైడ్ల పాత్ర ప్రశంసనీయమని హొసపేట ఎమ్మెల్యే గవియప్ప అన్నారు. జిల్లాపరిపాలన, పర్యాటక శాఖ, జిల్లాపర్యాటక శాఖ అభివృద్ధి కమిటీ, అకర్ష ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో నగరంలోని మల్లిగే హోటల్ ఆడిటోరియంలో జరిగిన టూరిస్ట్ గైడ్‌ల ఒక రోజు శిక్షణ, సర్టిఫికెట్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హంపిలో 1600 దేవాలయాలు ఉన్నాయని, విజయనగర సామ్రాజ్యం కేవలం పర్యాటక కేంద్రం మాత్రమే కాదన్నారు. మతపరమైన ప్రదేశం కూడా అని, హంపిలో భువనేశ్వరీ దేవి ఆలయం ఉందని పంపా విరూపాక్షేశ్వరుని చరిత్ర శివపురాణంలో అనవాళ్ల ద్వారా వెల్లడైందన్నారు. తుంగభద్ర నది ఒడ్డున ఉన్న దక్షిణ కాశీగా వెలుగొందుతోందన్నారు. స్వదేశీ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు గైడ్‌ల కొరతను నివారించడానికి 75 మంది స్మారక గైడ్‌లు, 25మంది ప్రకృతి గైడ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. మూడునెలల పాటు శిక్షణ ఇచ్చిందని తెలిపారు. మొత్తం 95మంది టూరిస్ట్ గైడ్‌లకు గుర్తింపు కార్డులు, ధృవపత్రాలు జారీ చేశామని తెలిపారు. హంపి పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రతి స్మారక చిహ్నం మధ్య రోడ్డు కనెక్టివిటీని కల్పించడానికి ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. కమలాపూర్ సరస్సును అభివృద్ధి చేసి దానిని ఇష్టమైన పర్యాటక కేంద్రంగా మార్చడానికి త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.

డీకే శివకుమార్ ప్రకటనపై బీజేపీ నిరసన

బళ్లారి సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లిలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటనను వ్యతిరేకిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం స్థానిక బసవేశ్వర సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ.. మత ఆధారిత రిజర్వేషన్లకు చోటులేదని బీజేపీ జిల్లాయూనిట్ ప్రధాన కార్యదర్శి రామన్న అన్నారు. కాంట్రాక్టులలో మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పడం సరికాదన్నారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని మార్చలేమని, రాజాంగ్యాన్ని అవమానించడంతో సమానమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బెన్నెకల్లు ప్రకాశ్, మాజీ అధ్యక్షుడు వీరేశ్వరస్వామి, నాయకులు కొట్రేశ్, బుడ్డి బసవరాజు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు జోగి హనుమంతప్ప, కృష్ణనాయక్, మహేంద్ర, కనకప్ప, శాంత కల్మానీ, గోవింద్, హనుమంతప్ప పాల్గొన్నారు.



హగరిబొమ్మనహళ్ళి బసవేశ్వర సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

మండుతున్న ఎండలు..!

● ఉదయం 10 గంటలకే భానుడి భగభగలు

● ప్రజలు బయటకు రాలేని పరిస్థితి



ఎడ్లబండిపై రోజువారీ కూలీ ఇలా..

గంగావతి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మార్చి నెల ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ సారి ఎండవేడి సాధారణం కంటే ముందుగానే తీవ్రమైనంది. దీంతో జిల్లాప్రజలు అల్లాడిపోతున్నారు. మార్చిలోనే ఉష్ణోగ్రత్తలు 37 నుంచి 38డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంటుండంతో ఏప్రిల్, మేల నెలల్లో ఎంత వేడిగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ మెదటి, రెండు వారాల్లో అనుభవించిన వేడి ఇప్పుడు మార్చిలో ప్రజలు చవిస్తున్నారు. ఏపీఎంసీలలో పనిచేసే కార్మికుల నుంచి ప్రతిరోజు నగరాలు, పట్టణాలను శుభ్రం చేసే మున్సిపల్ కార్మికుల వరకు ఎండవేడినా తాళలేకపోతున్నారు. ఎండ నుంచి ఉపశమనం కోసం ప్రజలు గొడుగులను ఆశ్రయిస్తున్నారు. వేడి



ఎండ వేడిమిని భరించలేక చున్నీలతో రక్షణ పొందుతున్న విద్యార్థినులు

ప్రభావంతో మధ్యాహ్నం సమయంలో కుకనూర్, కొప్పళ, గంగావతి సహా అనేక ప్రాంతాల్లో ప్రజల కదలికలు తక్కువగా ఉన్నాయి. వడదెబ్బ తగిలే వారికి చికిత్సలు అందించేందుకు జిల్లాసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కొబ్బరి బోండం ధరలు పెరిగాయి. పుచ్చకాయ, ద్రాక్ష, తదితర పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. ప్రజలు ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో ఇళ్ల నుంచి బయటకు రావొద్దని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఒక వేళ వచ్చినా టోపీలు, తెల్ల దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.



మాట్లాడుతున్న మోహన్‌కుమారి

సమాజంలో మహిళ పాత్ర కీలకం

● చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి మోహన్‌కుమారి

బళ్లారి సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళ పాత్ర కీలకమని చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మోహన్‌కుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలు సమాన హక్కుల కోసం పోరాడి సాధించుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జనవాది మహిళా సంఘం నాయకురాలు చంద్రకుమారి మాట్లాడుతూ సమాన హక్కుల సాధన కోసం వందల సంవత్సరాలుగా వివిధ దేశాల్లో మహిళలు చేసిన పోరాటాల ద్వారా హక్కులను నిరూపించుకోగలిగారన్నారు. ఇందులో భాగంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. కిరణ్‌కుమారి, ఎర్రమ్మ, రాణి ఎలిజబెత్, శిల్ప, వరలక్ష్మి, రుద్రమ్మ, తరంగిణి, సీఐటీయూ జె.ఎస్.సత్యబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలకు విద్య అందించండి

● కార్మికులకు ఎమ్మెల్యే గణేశ్ సూచన



కార్మికులకు కిట్లనుపంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేశ్

కంప్లి,మార్చి 26(ఆంధ్రజ్యోతి): కార్మికులు తమపిల్లలను పనులకు దూరంగా ఉంచి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే గణేశ్ కోరారు. బుధవారం స్థానిక షుగర్ ఫ్యాక్టరీలోని కోందండరామ దేవస్థానంలో కార్మిక శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమకు గురువుతో సమానం అయిన కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్ బళ్లారి జిల్లాలో కంప్లి నియోజకవర్గానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఎక్కువగా కార్మికుల అభివృద్ధికి పథకాలు అందించారని కొనియాడారు. ఎమ్మెల్యేగా తాను కొనసాగడం ఆయన ఇచ్చిన అవకాశమేనన్నారు. కార్మికుల పిల్లలకు మురార్జీదేశాయ్ వసతి పాఠశాల ఏర్పాటుకు అప్పుడే రూ.44కోట్లు మంజూరు అయ్యాయని అన్నారు. కురుగోడు తాలూకాలో భూ సర్వే చేపట్టే స్థలం కూడా సూచించారు. ప్రతి కార్మికుడికి రూ.7లక్షలతో ప్రతి బీద కుటుంబానికి గుర్తుండే విధంగా ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. ప్రతి ఒక్క కార్మికుడు గుర్తింపు కార్డును పొందాలని సూచించారు. అనంతరం కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. శేఖర్ తిమ్మప్ప, వన్నూర్‌సాబ్, కార్మిక సంఘాల పదాధికారులు పాల్గొన్నారు.

బ్యాగ్ దొరికింది.. డబ్బులు మాయం..!



ఖాళీ బ్యాగ్‌ను చూపుతున్న రైతు

కంప్లి,మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జనవరి 6వ తేదీన బళ్లారి రోడ్‌లోని మెకానిక్ షెడ్ ముందు బసవేశ్వర క్యాంప్ పుల్లంరాజు రైతుకు చెందిన రూ.6లక్షలు దొంగతనం జరిగింది. వెంటనే రైతు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజ్ ప్రకారం ద్విచక్రవాహనంపై ఇద్దరు వచ్చి ఒక్కరు మాత్రమే రైతుకు చెందిన డబ్బుల బ్యాగ్‌ను తీసుకెళ్లినట్లు కనిపించింది. అంతకముందు పల్లంరాజు ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి రూ.6లక్షలు తెచ్చిన విషయం తెలుసుకుని ఇద్దరు వ్యక్తులు ఒక ద్విచక్రవాహనం కార్ వెంబడే వచ్చి పుల్లంరాజు కారును షెడ్‌లో మరమ్మతు చేయిస్తూ తన పక్కనే బ్యాగ్ ఉంచుకున్నాడు. కొంత సమయం తరువాత చూసుకోగా బ్యాగ్ కనిపించలేదు. సంఘటన జరిగి 2 నెలలు అయినా ఇంతవరకు దొంగల ఆచూకీ లభించలేదు. అయితే కొన్ని రోజుల క్రితం బ్యాగ్‌తో పాటు ఐడెంటిటీ కార్డు, పాన్‌కార్డు, ఆధార్ కార్డు, చెక్కుబుక్, రేషన్ కార్డు, హొసపేట రైల్వేట్రాక్ వద్ద దొరికిందని పోలీసులు తెలిపారు. నా డబ్బును కంప్లి పట్టణంలోని వారే దొంగిలించారని రైతు తెలిపాడు. పోలీస్ శాఖ అధికారులు తమపై కనికరం ఉంచి దొంగలను గుర్తించాలని కోరారు.

4 నుంచి సాంస్కృతిక జనోత్సవాలు

● ఏఐడీవైఓ జిల్లా అధ్యక్షుడు చన్నబసవ జానేకల్



మాట్లాడుతున్న చన్నబసవ జానేకల్

రాయచూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని కన్నడ భవన్‌లో ఏప్రిల్ 4 నుంచి 6వ తేదీ వరకు రాయచూరు సాంస్కృతిక జనోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఐడీవైఓ జిల్లా అధ్యక్షుడు చన్నబసవ జానేకల్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాల వివరాలను వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా తొలి రోజు నగరంలోని మహిళా సాంస్కృతిక సంఘం, పండిత్ తారానాథ్ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కళాజాతా ఊరేగింపు ఉంటుందన్నారు. ఉత్సవాల సందర్భంగా కవితా గోష్ఠులు, ఉపన్యాసాలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ముగింపు రోజు స్థానిక పండిత్ సిద్ధరామ జంబలదిన్ని రంగమందిరంలో కవితా గోష్ఠి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌యూసీఐ రాష్ట్ర కార్యదర్శి పద్మ హాజరవుతారన్నారు.

అగ్నివీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అగ్నివీర్ పథకం కింద భారత సైన్యం వివిధ ఆర్మీ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. 17 సంవత్సరాల 6 నెలలు పూర్తి చేసుకున్న 21సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నఅభ్యర్థులు అర్హులుగా నిర్ధారించారు. 8వ తరగతి నుంచి పియూసీ(ఇంటర్), ఐటీఐ అర్హతలు ఉన్న అభ్యర్థులు పాల్గొనవచ్చు. రాబోయే రోజుల్లో నియామక స్థలాన్ని ప్రకటిస్తారు. మరిన్ని వివరాలకు 08392-294230నంబర్‌లో కాని, కార్యాలయాన్ని లేదా జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని నైపుణ్యాభివృద్ధి అధికారి తెలిపారు.

గుర్తుతెలియని శవం లభ్యం

రాయచూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కృష్ణనది తీర గ్రామం దేవదుర్గ తాలూకా గూగల్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. మృతుడు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని గబ్బూరు ఎస్ఐ ప్రకటనలో తెలిపారు. శవం ఎవరిదో గుర్తించకపోవడంతో మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు వెంటనే గబ్బూరు పోలీస్ స్టేషన్ లేదా దేవదుర్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబర్ 9480803860, దేవదుర్గ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 9480803835లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

హోసూరు జోన్

నిరాశ్రయుల కేంద్రాన్ని పరిశీలించిన మేయర్



వృద్ధురాలిని ఆరా తీస్తున్న మేయర్ సత్య

హోసూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నిరాశ్రయులకు ఆసరాగా ఉంటున్న కేంద్రాన్ని మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్యలు పరిశీలించారు. ఆరాధన సోషల్ సర్వీస్ అండ్ స్కిల్ డెవలెప్‌మెంట్ ట్రస్టు పదాధికారులు పాల్గొన్నారు. ఇక్కడ ఉంటున్న మానసిక దివ్యాంగులకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాధ మాట్లాడుతూ పారిశ్రామిక వాడ హోసూరుకు తమిళనాడు నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలనుంచి ప్రజలు వస్తుంటారన్నారు. కొంతమంది దారితప్పినవారికి పోలీసులు, సామాజిక కార్యకర్తలు ఇచ్చిన సమాచారం మేరకు తమవంతుగా చేయూత ఇస్తున్నామన్నారు. వార్డు కార్యదర్శి రఘు, చన్నపన్ సీమ రాజా, అన్నామలై నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాయకన్నన్, శేఖర్, అరవింద్, నాగరాజ్ తదితరులు ఉన్నారు. కోలుకున్నా వారిని సొంత ప్రాంతాలకు పంపే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు.

మురుగు కాలువ నిర్మించండి

హోసూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమలనగర్ ప్రాంతంలో సరైన మురుగు కాలువ వ్యవస్థ లేకపోవడంపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈమేరకు కమిషనర్ మారిసెల్వికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం స్థానికులు మీడియాతో మాట్లాడుతూ తిరుమలనగర్‌లో 500కుపైగా కుటుంబాలు ఉన్నాయని, కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. సంవత్సరాల క్రితం మురుగుకాలువ నిర్మాణ పనులు చేపట్టి అర్ధంతరంగా నిలిపివేశారన్నారు. మురుగుకాలువలు లేకపోవడంతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు.



వినతిపత్రం చూపుతున్న స్థానికులు

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

హోసూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): హోసూరు పంచాయతీ యూనియన్ పరిధిలోని గోవింద అగ్రహార గ్రామంలో ఆల్ గ్రామ అణ్ణా పునరుజ్జీవనం పథకం కింద రూ.16.55 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే వై ప్రకాశ్ లాంఛనంగా ప్రారంభించారు. హోసూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, హోసూరు యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, డిప్యూటీ సెక్రటరీ రమేశ్, యూనియన్ మాజీ కమిటీ సభ్యులు గోపాల్, వేణు, రాజా, మంజునాథ్, శివ, డీఎంకే నాయకులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్